'Bharath Gourav Award' to Prasad Thotakura

# ప్రసాద్ తోటకూరకు భారత్ గౌరవ్ అవార్డ్



న్యూఢిల్లీకి చెందిన ఇండియా ఇంటర్నేషనల్ ఫ్రెండ్ షిప్ సొసైటీ (ఐఐఎఫ్ఎస్) 2010వ సంవత్సరానికి ప్రతిష్ఠాత్మకమైన భారత్ గౌరవ్ అవార్డులను ప్రకటించింది. అమెరికాలోని డల్లాస్ ప్రాంతానికి చెందిన ఎన్ఆర్ఐ ప్రముఖుడు, తెలుగు సంతతికి చెందిన ప్రసాద్ తోటకూరను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. జాతికి ఉత్తమ సేవలందించినందుకుగాను ఆయనకు ఈ అవార్డ్ అందించారు. న్యూఢిల్లీలో జనవరి 7వ తేదీన జరగనున్న కార్యక్రమంలో ఆయనకు ఈ వార్డ్‌ను అందజేయనున్నారు. అమెరికాలోని భారత సంతతికి చెందిన వారికి గత పదిహేను సంవత్సరాలుగా ప్రసాద్ తోటకూర వివిధ హోదాలలో సేవలందిస్తూ వచ్చారు. వృత్తిరీత్యా **eknazar.com,** అనే కంపెనీలో ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ప్రసాద్ పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా)కు ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా, ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్ (ఐఎఫ్‌సి)కి జనరల్ సెక్రటరీగా వ్యవహరిస్తున్నారు. వీటికి తోడు ఆయన అనేక పదవులలో కొనసాగుతున్నారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) మాజీ డైరెక్టర్ సర్దార్ జోగిందర్ సింగ్ ఐఐఎఫ్ఎస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రేమ్ కుమార్ ధూమాల్, మాజీ గవర్నర్ మదన్‌లాల్ ఖురానా, మాజీ ఎన్నికల కమీషనర్ జివిజి కృష్ణమూర్తి, సుప్రీంకోర్ట్ న్యాయమూర్తి హనుమంతప్ప ఈ సంస్థకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా వ్యవహరిస్తున్నారు.

న్యూఢిల్లీలో 2010వ సంవత్సరం జనవరి 7వ తేదీన ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ సొసైటి ఆధ్వర్యంలో జరగనున్న సదస్సులో ప్రపంచవ్యాప్తంగా అనేక కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, నాయకులు, ఆర్థికవేత్తలు, పెట్టుబడిదారులు హాజరుకానున్నారు. వీరిలో భారత కేంద్ర మంత్రి ముకుల్ వాస్నిక్, పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ హెచ్.హెచ్. ఇక్బాల్ సింగ్ తదితరులున్నారు. ఇండియా ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ సొసైటీ వివిధ అవార్డులకు ఎంపిక చేసిన వ్యక్తుల వివరాలిలా ఉన్నాయి. దక్షిణాఫ్రికాకు చెందిన రాజ్‌బన్సాసి, బ్రిటన్‌కు చెందిన సందీప్ శర్మ, కెనడా పార్లమెంట్ సభ్యులు సుఖ్‌దలివాల్, అమెరికాకు చెందిన డాక్టర్ భగవాన్‌షాని, సౌదీ అరేబియాకు చెందిన జగన్నాథ్, అమెరికాకు చెందిన ప్రొఫెసర్ వో. కుమార్ తదితరులున్నారు. గతంలో ఇండియా ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ సొసైటీ అవార్డులు అందుకున్న వారిలో నోబెల్ బహుమతి విజేత మదర్ థెరిస్సా, మాజీ ఉపరాష్ట్రపతిబి.డి. జెట్టీ, మాజీ గవర్నర్ భీష్మనారాయణ్ సింగ్, గోవా ముఖ్యమంత్రి దిగంబర్ కామత్, క్రికెట్ క్రీడాకారుడు సునీల్ గవాస్కర్, నటులు షమ్మీ కపూర్, రాజేష్ ఖన్నా, దేవానంద్ తదితరులున్నారు.

ఇండియా ఇంటర్నేషనల్ ఫ్రెండ్‌షిప్ సొసైటీ పదిహేను సంవత్సరాలుగా పేరు ప్రఖ్యాతులు గాంచిన లాభాపేక్షలేని ప్రభుత్వేతర సంస్థ. విదేశాలలో స్థిరపడిన భారత సంతతికి చెందిన వారు జాతికి అందిస్తున్న సేవలను గుర్తించి, స్వదేశంతో వారికి సంబంధాలు పెంపొందించేందుకు ఈ సంస్థ కృషి చేస్తుంది.